సర్కారు ఆఫీసులకీ తేడాలేదూ? ఆస్పత్రిలో రోగుల ప్రాణాలతోనా చెలగాటం? ఒకప్రక్క రోగి చావుబతుకులమీద వుండి సర్కారు ఆస్పత్రిగదా అని కొండంత ఆశతో వస్తే, వాళ్ళకు సరియైన వైద్యంచెయ్యక నానా అవస్థలు పెట్టి, లంచాలకు చేతులు చాపుతే, ఇంకా ఈ ఆస్పత్రులు దేనికి? ప్రభుత్వం వైద్యశాఖకి ఇంత డబ్బు ఖర్చుచెయ్యటం దేనికి? అదంతా బూడిదలో పోసిన పన్నీరులా వృధా కావాలిసిందేనా? ఆవేశంగా అన్నాను నేను.

అవునుమరి. ఈనాడు సర్కారు ఆస్పత్రి నిజ పరిస్థితి తెలిసిన ఎవరికయినా వీటివలన సామాన్య ప్రజలకు ఉపయోగం శూన్యం అనే ఉద్దేశ్యం కలగటం సహజం.

"పోనీ ఆ డాక్టర్లకు, నర్సులకు జీతాలు తక్కువ, చాలక బాధపడుతున్నారు అని అనుకుందామంటే డాక్టర్లకు దాదాపు మూడువందల రూపాయలు. నర్సులకు అందులో సగం ముట్టతయ్యే, ఇంకా వాళ్ళకు జీతాలు చాలక ఈ లంచాలకు దిగారంటే అర్థం లేదు" అన్నాడు సుబ్బారావు.

"అయితే ఈ ఆస్పత్రులకు ఖర్చుపెడుతున్న ప్రజల సొమ్మంతా యిలా పాడయిపోవలసిందేనా?" ప్రశ్నించాను నేను.

"అది స్వతంత్ర భారతదేశంలో నివసిస్తున్న స్వతంత్రం పౌరులమైన మనమే ఆలోచించాలి" అన్నాడు సుబ్బారావు.

తరువాత మేము చాలాసేపు అవీఇవీమాట్లాడుకొన్నాం. నేను ఇంటికి చేరుకొన్నాను. అప్పటికి పన్నెండు గంటలు కావచ్చింది. ప్రజలకు అవసరమైనప్పుడు ఉచితవైద్య సౌకర్యాలు ఎలాంటి ఇబ్బందులకు లోనుగాకుండా అందచేయటానికి తగిన మార్గాలను గురించి యోచించుకొంటూ నేను భోజన ప్రయత్నంలో నిమగ్నుడనయాను.

---

# లభించిన పారితోషికం

ముక్కామల కృష్ణారావు

రామంలో కథలు వ్రాయాలన్న ఉత్సాహం ఉబకడానికి కారణం "ఆమె" అని చెప్పక తప్పదు. "కథలు వ్రాయాలంటే చక్కటిఅమ్మాయి చిరునవ్వు మనసులో అహర్నిశలు మెదలాలోయ్" అన్న శశి మాటల్లోని గూఢార్థం రామానికి సమంజసంగా తోచింది. ఆమె చిరునవ్వుకై తహతహబడ్డం, తీయని కలలు కనడం రామంచేత కథలు వ్రాయించడం మొదలుపెట్టించాయని చెప్పాలి. అసలు కథలు వ్రాయడంలో ఒక విధానం ఉందని రామానికి తెలీదు. కాగితం మీద కలం పడగానే అతనిలోని భావాల తరంగాలు పొంగి పొరలేవి. తను వ్రాసిన కథలను చదువుకుని తనే మురిసిపోయేవాడు. అతని హృదయం పులకితమయేది. పత్రికలో ప్రచురింపబడ్డాక కొన్ని వేల పాఠకులు తన కథను చదువుతారు. ఆమెకూడ చదువుతుంది. తను ఆమె హృదయంలో మెదుల్తుంటాడు. ఆమె చిరునవ్వు తన హృదయంలో అమృతాన్ని వర్షిస్తుంది. ఆలోచనల పరంపరలో రామం మనసు ఉప్పొంగేది. ఆమె అతని హృదయంలో మెరపులా మెరసేది. ఆ మెరుపే అతనిలో ఉత్సాహమును ద్విగుణీకృతం చేసేది. మనసులో పొంచివున్న భావాలలో చలనం కలుగచేసేది. చలనంతో పాటు జీవితం హాయి అనిపించేది అతనికి. చూస్తున్న ప్రతీ వస్తువులో నూతనత్వం గోచరించేది. ఆమె సౌందర్యలహరి అతన్ని ఆనందములో ముంచివేసేది. ప్రకృతిలోని చల్లదనం అతన్ని పరవశుణ్ణి చేసింది. ఆమె తీయని పలుకులస్వరం, కిలకిల నవ్వులు అతన్ని మత్తెక్కించాయి. పల్చని తెల్లని వెన్నెలలో, జాజిమల్లి వాసనలతో మిళితమై వస్తున్న చల్లని గాలిలో తన్మయత్వంలో మునిగిపోయి, తీయని భావాలలో పొందబోయే భావి ఆనంద తరంగాలలో తేలిపోతూ ఎన్నో ప్రేమ గాథలను వ్రాశాడు రామం.

కాని హటాత్తుగా ఒకనాడు ఆమె అతని ముందునుంచి మాయమవడంతో రామం మనసులోని సున్నితభావాలు విప్లవంలోలా చెల్లాచెదరై నలుప్రక్కలా పరుగులుతీశాయి. తీయని తలుపులు అదృశ్యమయినాయి. అట్లాగని అతను విరహవేదనతో పిచ్చివాడవలేదు. ఆమెను ప్రేమి

స్తున్నానన్న భావం అతనిలో మబ్బుతెరలా వచ్చి మాయమయిందేకాని అతను ప్రేమించి కామించ లేదు. అతను వ్రాసే కథలకు ఆమె అనుగుణ్యంగా కొంతకాలంవుండి హటాత్తుగా మాయమవగానే అతను వ్రాసేకథల్లోని నాయికరూపం అదృశ్యమైనదని విచారించాడు. అతని కళ్ళనుంచి ఆమె వేరవగానే అతను వ్రాసేకథలు నిస్సారమయాయి. అతనిలో ఆలోచనలు, భావాలు శుష్కించి పోయాయి. ఏ ఆధారం లేకుండా కథలువ్రాయడానికి అతని కలంలో శక్తి నశించింది. ఆమెను తలచుకుంటూ విరహవేదనతో, విరిగిన మనసుతో కథలను సృష్టించడానికి అసలు ఆమె ఛాయలు అతని హృదయంలో మెదలడంలేదు. ఇట్లా అంటే అసంగతం! అసంభవం! అనుకోవచ్చు. కాని ఆమెను వాంఛించలేదు రామం. ఆమె తనది అయిపోవాలని అనుకోలేదు. ఆమెను చూస్తూ ఆమెనే తన ప్రేయసిగా భావించి కథలు వ్రాసాడేగాని ఆమెనే తన కాబోయే ప్రేయసి అని మనసులో ఆమె ప్రతిబింభాన్ని నాటించుకో లేదు అతను. ఆమె తననుంచి వేరయాక ఆమె ఛాయలుకూడా అతని మనసులోంచి మాయమయాయి. ఆమె ఛాయలు అదృశ్యమవడంతో అతని కలం ముందులా ముందుకు సాగలేక పోయింది. అయినా కథలు వ్రాయాలన్న అభిలాష అతనిలో అంతరించలేదు. ఆమెను ఆధారంగా తీసుకొని ప్రేమకథలు వ్రాశాడు కాని ఆమె దూరమయాక, మాయమయాన తను వ్రాయబోయే కథలకు ఆధారం ఏమిటో బోధపడక తికమకపడ్డాడు అతను. ఏ ఆధారం లేకుండా కల్పన కథలు వ్రాయడానికి అతని మెదడులో పటుత్వం లేదు.

అయినా కథలో ప్రాయాలన్న ఉత్సాహం అడుగంటిపోలేదు రామంకి. తనకళ్లకి నూతనంగా కనిపించే ప్రతీవిషయం అతను కథగా మార్చి వ్రాయడం మొదలు పెట్టాడు. అతనికలం క్రొత్త పంథా త్రొక్కింది. అసంగతం, అన్యాయం, ఇమిడి ఉన్న ప్రతీవిషయాన్నీ విమర్శిస్తూ లోకంముందు ఉంచడం అతనికి ఎంతోగర్వంగా తోచేది. కాని లోకం తనవ్రాతకి అడ్డుగా నిలవడం అతనికి కష్టమనిపించింది. ముందుముందు తన అభిప్రాయాలను కొనియాడిన లోకమే అతనిమీద విరుచుకు పట్టంతో రామంలోని ఉత్సాహం క్షీణించింది. తనలో చెలరేగే భావాలను బైటకు వెళ్ళగ్రక్కితే లోకం తన వ్రాతకి అడ్డుతగలడ మెందుకో అతనికి అవగాహన కాలేదు. తన వ్రాతనుచూసి శభాష్ అన్నదీ ఈలోకమే! తన వ్రాతలను ఖండించేదీ ఈ లోకమే. తను వ్రాసే ప్రతీ పంక్తిని లోకం సెన్సర్ చేస్తుందని రామం తెలుసుకోగలిగాడు. తన కలంను నిర్భందించడంలో లోకం పొందే లాభం ఏమిటో అతనికి బోధపడలేదు.

తను వ్రాసిన కథమీద కోర్టులో ఒక పెద్దమనిషి దావా పడేసాడన్న వదంతివిని రామం ఆశ్చర్యపోయాడు. ఇంతకీ తను ఒక వ్యక్తిమీద కోరుండి .లేనిపోనివి కల్పించి ఇప్పటిదాకా ఏ కథనూ వ్రాయలేదన్న సంతుష్టి అతనికి దావా భయాన్ని పోగొట్టింది. అటువంటప్పుడు లోకం తనను రచ్చకీడ్చడం సబబుగా తోచలేదు రామానికి. లోకంలో జరుగుతున్న మంచి చెడ్డలను లోకానికి తెలియజేస్తే తనమీద విరుచుకుపడినంత అవసరం లోకానికి ఎందుకు కలిగిందో బోధపడలేదు అతనికి.

కోర్టుకి హాజరవాలని "సమన్స్" చూసాక రామం గుండెలు పీచుపీచు మన్నాయనే చెప్పాలి.

"నువ్వు ఒక వ్యక్తి గౌరవ మర్యాదలమీద డైరెక్టుగా నీ...కథలో ఈ పెద్దమనుష్యునిమీద కోరి దెబ్బ కొట్టావు. కాబట్టి సెక్షన్...ప్రకారంగా నీకు ఐదువందల రూపాయిలు జుర్మానా వేయడమయినది." అని కోర్టువారి తీర్పు విన్నాక రామానికి గుండెలు బ్రద్దలు అయేటంత పని అయింది. లోకంలో న్యాయం, అన్యాయం ఇమిడివున్నాయి. వాటిని విమర్శించడం, ఒక పెద్దమనిషిని విమర్శించడం అని ఎట్లా కోర్టు నిర్ధారణబరచిందో రామానికి అవగాహనకాలేదు. వ్రాసే కథల్లోని ప్రతీ పంక్తి లోకానికి సంబంధించి ఉంటుంది. అట్లా అని అతనిమీదనే కథ వ్రాసావని కోర్టు తీర్మానం చెప్పడం తనకు జుర్మానా విధించడం విచారానికి బదులు నవ్వును పుట్టించాయి రామానికి. తనలోని న్యాయం ఏ మూల నక్కి కూర్చుందో బోధపడలేదు అతనికి. న్యాయానికి పారితోషికం అయిదువందల రూపాయిలు జుర్మానా! రామం తల తిరిగిపోయింది.